క్లుప్తంగా

దద్దాలను సత్కరించిన పార్టీ నాయకులు



దద్దాలను సన్మానిస్తున్న పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిముటి దేవప్రసాద్ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. అనంతరం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవప్రసాద్, దర్శి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గల్లె పోగు ఏసుదాసు, కేశపల్లి నాగేశ్వరావు, రాజు రత్నంలు దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ. 25 వేలు ఆర్థిక సాయం

కనిగిరిరూరల్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్న వెలిగండ్ల మండలం కంకణంపాడుకు చెందిన బచ్చలి హిమనోష్ కృష్ణా కుమార్‌కు కనిగిరి మాజీ ఎమ్మెల్యే, పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకు కదిరి బాబురావు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు బచ్చలి హిమనోష్ కృష్ణకుమార్ త్వరగా కోలుకోవాలని బాబురావు ఆకాంక్షించారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



నీటి ట్యాంక్ వద్ద విరిగిపడిన విద్యుత్ పోల్

హనుమంతునిపాడు: మండల పరిధి కూటాగుండ్ల ఎస్సీ కాలనీ నరవగోపాలపురం రోడ్డు పక్కనే రైతు భరోసా సేవా కేంద్రం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. సాగర్ జలాలు పంపింగ్ చేసే మోటార్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై స్తంభం పడిపోవడంతో 10 రోజులగా నీటి సరఫరా నిలిచిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ అధికారులకు చెప్పినా స్తంభాలు లేవు.. వచ్చిన వెంటనే మార్చి విద్యుత్ కనెక్షన్ ఇస్తామంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం మార్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి నీరందించాలని ఇవ్వాలని గ్రామస్తులు రాజు, మాలకొండయ్య, వెంకయ్య, వెలుగొండయ్య తదితరులు కోరుతున్నారు.


భక్తులకు వసతుల కల్పనపై చర్యలు



అర్చకులు, స్థానికులతో దేవదాయశాఖ జిల్లా అధికారి పానకాలరావు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పర్యాటక ప్రాంతం, పుణ్యక్షేత్రం భైరవకోనకు వచ్చే భక్తులకు వసతులు కల్పనపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని దేవదాయశాఖ జిల్లా అధికారి పానకాలరావు ఈవో డీ వంశీకృష్ణారెడ్డికి సూచించారు. ఈసందర్భంగా జలపాతం వద్ద వసతులు, త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ ఆలయాలవద్ద వసతులు, క్యూలైన్‌లు, భద్రతలపై ఈఓ వంశీకృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనంచేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు పంచాగ్నుల రామ్మూర్తి, పలువురు పాల్గొన్నారు.

పోరాటయోధుడు అచ్యుతానందన్



అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొండపి: కష్టజీవుల కుటుంబంలో పుట్టి జీవితాంతం అసమాన పోరాటాలు కడవరకు కమ్యూనిస్టుగా సాగిన అచ్యుతానందం జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య అధ్యక్షతన పెరిదేపిలో అచ్యుతానందన్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ యువకుడిగా ఉన్న సమయంలో ఒకవైపు స్వాతంత్ర పోరాటంలోనూ మరొకవైపు జమీందారీ వ్యతిరేక పోరాటాలను వీరోచితంగా నిలబడ్డారని తెలిపారు. పేదలకు భూములు దక్కాలని ఆయన నాయకత్వంలో జరిగిన పోరాటంలో సంవత్సరాల తరబడి అరెస్టులు, నిర్బంధాలు, జైళ్లకు ఆయన గురయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, సీపీఎం మండల నాయకులు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య పాల్గొన్నారు.





గుంతలమయంగా ఉన్న నందనవనం-కలికవాయి రహదారి

పట్టని ప్రభుత్వం.. మాట వినని అధికారులు !

నందనవనం గ్రామస్తులే స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

- తీరిన ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సింగరాయకొండ:

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనికరించలేదు. మా గ్రామాలకు రోడ్డు వేయండి.. రాళ్లుతేలి, గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అని విన్నవించుకున్నా కూటమి నాయకులు, అధికారులు పట్టించుకోలేదు. విసిగివేసారిన గ్రామస్తులు చేయిచేయి కలిపి వారే రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు. కేవలం 5 నిమిషాల్లో ప్రయాణించే రోడ్డు పై సుమారు 20 నిమిషాలు సమయం పడుతోంది. ఈ విధంగా దాదాపు సంవత్సరం నుంచి నందనవనం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు పునర్ నిర్మించి మా ఇబ్బందులు తీర్చాలని కొద్దినెలలుగా అధికారులు చుట్టూ తిరిగారు. నూతన రోడ్డు నిర్మాణానికి కోట్లాది రూపాయలతో ప్రతిపాదనలు పంపాం అని చేతులు దులుపుకుంటున్నారని చివరకు మరమ్మతులు కూడా చేయలేదని గ్రామస్తులు ఆవేదన చెందారు. చివరికి గ్రామస్తులే నడుం బిగించి మన ఇబ్బందులు మనమే తీర్చుకోవాలని సంకల్పించి చందాలు వేసుకుని సుమారు రూ.50 వేలతో రోడ్డు మరమ్మతులు చేసుకున్నారు. దీంతో సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉన్న నందనవనం-కలికవాయ రోడ్డు ప్రస్తుతం రాకపోకలకు అనువుగా మారటంతో గ్రామస్తులు దాతల ఔదార్యాన్ని మెచ్చుకుంటున్నారు.



దాతల సహకారంతో గుంతలు పూడ్చిన దృశ్యం

2018లో రోడ్డు నిర్మాణం..

ఈరోడ్డును గత టీడీపీ ప్రభుత్వంలో సుమారు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో 2018 ఏడది చివరి మాసాల్లో నిర్మించారు. ఈ రోడ్డును సుమారు 5 సంవత్సరాల పాటు కాంట్రాక్టరు మరమ్మతులు చేయాల్సి ఉంది. కాని రోడ్డు నిర్మించిన వారానికే రోడ్డు మార్జిన్లు ధ్వంసం అయి రోడ్డు నాణ్యత డొల్లతనమని తేలింది. వాస్తవానికి తారు రోడ్డు కాల పరిమితి 10 నుంచి 15 సంవత్సరాలు ఉంటుంది. కాని నాసిరకంగా నిర్మించడంతో పాటు ఈ రోడ్డులో 24 గంటలు ఇసుక ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరగటంతో పాటు సామర్థ్యానికి తగ్గట్లుగా రోడ్లు నిర్మించక పోవడంతో త్వరగా దెబ్బతిన్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

దాతల సహకారంతో తొలగిన ఇబ్బందులు..

రోడ్లు గుంతలు పూడుస్తామని అద్దాల్లా మెరిసేలా చేస్తామని కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు



ప్రకటనలు ఇవ్వటమే తప్ప ఆచరణలో మాత్రం అమలు జరగటం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నందనవనం-కలికవాయ రహదారి గుంతల మయంగా మారిందని తాత్కాలికంగా మరమ్మతులు చేసి కొత్త రోడ్డు నిర్మించాలని పత్రికలలో కథనాలు వచ్చినప్పటికి ప్రభుత్వ పెద్దలు తమ ఇబ్బందులు పట్టిపట్టనట్లు వ్యవహరించారు. ఆఖరికి మరమ్మతులు కూడా చేయించలేదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దాతలు ముందుకు వచ్చి తమ ఇబ్బందులు తీర్చారని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

కొనసాగుతున్న బేళ్ల తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 8వ రౌండ్ ప్రారంభం నుంచి బేళ్ల తిరస్కరణ అధికంగా ఉంది. 8వ రౌండ్ ప్రారంభంలో 300కు పైగా బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ రౌండ్ చివరి దశకు చేరుకునేసరికి ఆ సంఖ్య 500 దాటింది. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న పొగాకు రైతులపై బేళ్ల తిరస్కరణతో అధిక భారం పడుతోంది. ధర తగ్గించైనా పొగాకు బేళ్లు కొనుగోలు చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక బేలును ఇంటి నుంచి వేలానికి తీసుకొచ్చి తిరస్కరణకు గురైతే ఇంటికి తీసుకెళ్లి మళ్లీ వేలానికి తీసుకొని రావాలంటే ఒక బేలులో దాదాపు పది కేజీల వరకు తేడా వస్తుందని, దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

512 బేళ్లు తిరస్కరణ:

స్థానిక పొగాకు వేలంలో 512 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పైడిపాడు, గోగినేనివారి పాలెం, అక్కచెరువుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1154 బేళ్లను వేలానికి తీసుకుచ్చారు. అందులో 642 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 512 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.281, కనిష్ఠ ధర కేజీ రూ.159, సరాసరి ధర కేజీ రూ.202.49 గా నమోదైంది. వేలంలో 24 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: పొగాకు వేలం ప్రారంభమై 5 నెలలు గడుస్తున్నా కనీసం సగం కూడా వేలం కేంద్రాల్లో కొనుగోలు జరగలేదని రైతులు వాపోతున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 281 పొగాకు బేళ్లు వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకి చెందిన రైతులు 859 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 578 కొనుగోలు చేశారు. 281 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ.160, సరాసరి రూ.206.02 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 34 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



పామూరు: శిష్ట అలంకరణలో వాసవీమాత మూల విగ్రహమూర్తి



కనిగిరి కోదండరామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పామూరు: మండల కేంద్రమైన పామూరు వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో శ్రావణమాసం శుక్రవారం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాసవీమాత మూల విగ్రహ మూర్తికి అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్‌శర్మలు అభిషేకం, కుంకుమపూజలు నిర్వహించారు. అదే విధంగా మహాలక్ష్మి ఆలయంలో అర్చకులు జే.వి.ఎస్.ప్రసాద్ విశిష్ట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట నరసింహారావు, మంచి కంటి మధు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: శ్రావణ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో విశిష్ట పూజలు జరిగాయి. స్థానిక కొత్తపేటలోని కోదండరామ స్వామి ఆలయంలో ఎంతో భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ నాయకులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, వీవీఆర్ మనోహర్‌రావు, అచ్చుల ధనమ్మ, కోటేశ్వరరావుల పర్యవేక్షణ ప్రత్యేక పూజలు జరిగాయి.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

సింగరాయకొండ: నేటి ఆధునిక సమాజంలో యువత ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వంటి అసాంఘిక కార్యకలాపాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ సీహెచ్ హజరత్తయ్య విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏఆర్‌సి అండ్ జీవిఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులకు చెడు నడవడిక వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ హజరత్తయ్య

ఇసుక టాక్టర్లు సీజ్

గుడ్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అందిన వివరాల మేరకు.. శుక్రవారం మండలంలోని దారకానిపాడు గ్రామంలో కొందరు అక్రమంగా ఇసుక తరలించి ఇళ్లు నిర్మించుకుంటున్నారన్న సమాచారంతో సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అక్కడకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ విజయభాస్కర్‌కు అప్పగించారు. దీంతో తహసీల్దార్ పోలీసులకు అప్పగించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

కందుకూరు: రక్తహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న గర్భిణులు, చిన్న పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు వరల్డ్ విజన్ వంటి సంస్థలు పనిచేయడం అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ కె అనూష అన్నారు. పట్టణంలోని క్లబ్‌రోడ్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో పలువురు గర్భిణులు, చిన్న పిల్లలకు వరల్డ్ విజన్ ద్వారా అందించే ఫుడ్‌బాస్కెట్‌లను శుక్రవారం ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వరల్డ్‌విజన్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ బ్యూలాగ్రేస్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రసవం సులభం అవుతుందని, రక్తం ఎక్కించుకునే సమస్య నుంచి బయటపడవచ్చునని వివరించారు.

సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కోవిలంపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ చెక్‌పవర్‌ను విచారణ అనంతరం డీపీఓ జి.వెంకట నాయుడు పునరుద్ధరించారు. ఈమేరకు చెక్‌పవన్‌ను పునరుద్ధరించినట్లు జిల్లా అధికారుల నుంచి ఉత్వర్వులు వచ్చినట్లు సర్పంచ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

కనిగిరిరూరల్: పౌర్ణమి సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ కనిగిరి డిపో ఆధ్వర్యంలో ఆగస్టు 7 నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం మొహమ్మద్ సయాన బేగం తెలిపారు. రెండ్రోజులు, 5 పుణ్యక్షేత్రాలు (కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి, అరుణాచలం, తిరుత్తణి)లను దర్శించుకొవచ్చన్నారు. ఈ యాత్ర ఆగస్టు 7వ తేదీ గురువారం రాత్రి 9 గంటలకు బయలు దేరి 08న శుక్రవారం కాణిపాకం, తిరుత్తణి, కంచి దర్శించుకుని, 09న తెల్లవారుజామున శనివారం అరుణాచలం చేరుతుందన్నారు. గిరి ప్రదక్షణ అనంతరం తిరుగు ప్రయాణంలో గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని 10న ఆదివారం ఉదయం 5 గంటలకు కనిగిరికి చేరుతారని వెల్లడించారు. టిక్కెట్టు ధర రూ. 2200 చెప్పారు. ఆన్‌లైన్ బుక్ చేసుకోవచ్చని, సర్వీసు నెంబర్ 48957 అని, టిక్కెట్ల కోసం 99854 71990 సంప్రదించాలన్నారు.

వల్లూరమ్మ ఆలయ సిబ్బందికి జీతాలు ఎప్పుడో ?

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయ సిబ్బందికి నెల రోజుల నుంచి ఇవ్వడం లేదని అర్చకులు, ఆలయ సిబ్బంది ఆరోపిస్తున్నారు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని, అలాగే ప్రమోషన్లు సక్రమంగా జరుగడం లేదని, కేవలం కింద స్థాయి సిబ్బందికి ప్రమోషన్లు ఇస్తున్నారని వాపోయారు. సీనియారిటీ బట్టి ఇవ్వడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్‌ని వివరణ కోరగా ఇప్పటివరకు క్రమం తప్పకుండా సకాలంలో సిబ్బందికి జీతాలు అందించామన్నారు. కొత్త ఆడిటర్ వద్ద జీతాలకు సంబంధించిన ఫైలు ఉంది, రెండు రోజుల్లో జీతాలు పడతాయన్నారు. అలాగే ప్రమోషన్లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని అన్ని పారదర్శకంగా జరిగాయని చెప్పారు.

పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

మద్దిపూడి: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. మండల యూత్ అధ్యక్షుడిగా మాకినేని హరీష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వై ఈశ్వరమ్మ, రైతు విభాగం మాలపాటి కొండారెడ్డి, బీసీ సెల్ మునపాటి నరసింహారావు, ఎస్సీ సెల్ గురిజాల రమేష్, ఎస్టీ సెల్ శ్రీరాం రమణయ్య, మైనారిటీ సెల్ షేక్ మస్తాన్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ కొమ్ము ప్రభుదాస్, స్టూడెంట్ విభాగం చెరుకూరి భాస్కర్‌రావు, పంచాయతీరాజ్ గంగిరెడ్డి రమణారెడ్డి, ఆర్‌టీఐ బండి వెంకటరెడ్డి, వలంటీర్స్ విభాగం బత్తుల శివాజీ, వీవర్స్ విభాగం సిగా పెదరోశయ్య, వాణిజ్య విభాగం గుట్లపల్లి కొండలరావు, వైఎస్సార్‌టీయూసీ బొమ్మినేని మధు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా వీ విజయలక్ష్మీ, స్వప్న, కల్చరల్ విభాగం గడ్డం బాల ఆంజనేయులు, సోషల్‌మీడియా ధ్యక్షుడిగా జీవీకే చైతన్యకుమార్, దివ్యాంగుల విభాగం మూలే నర్సారెడ్డి, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా అత్తులూరి తిరుపాల్ నాయుడులు నియమితులయ్యారు.

టంగుటూరు మండలం..

మండల యూత్ అధ్యక్షుడిగా దేవరపల్లి వరణ్, మహిళా విభాగం బిల్లా ఝాన్సీ, రైతు విభాగం తక్కెళ్లపాటి సుధాకర్, బీసీసెల్ బీమవరపు అంకయ్య, ఎస్సీ సెల్ సనగర కోటేశ్వరరావు, ఎస్టీ సెల్ ఇండ్లా జాలమ్మ, మైనారిటీ సెల్ పఠాన్ జిలానీ, విద్యార్థి విభాగం చింతం చైతన్యరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ ఏలూరి వంశీకృష్ణ, ఆర్‌టీఐ వింగ్ పమ్మి చక్రారెడ్డి, వలంటీర్స్ వింగ్ దావులూరి సునీల్, వీవర్స్‌వింగ్ కసుకుర్తి వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం పేరూరి కమలాకర్ రావు, వైఎస్సార్‌టీ యూసీ వలివర్తి శ్రీనివాసరాజు, అంగన్‌వాడీ వింగ్ బొద్దు వాసంతి, కల్చరల్ వింగ్ కాకుమాని శ్రీనివాసరావు(కేఎస్ఆర్), సోషల్‌మీడియా వింగ్ పందిటి అశోక్, దివ్యాంగుల విభాగం పసుపర్తి రాజేష్, పబ్లిసిటీ వింగ్ దగ్గుమాటి సుమన్‌రెడ్డిలు నియమితులయ్యారు.

చెట్లుంటేనే పర్యావరణం మనుగడ

టంగుటూరు: చెట్లుంటేనే పర్యావరణం మనుగడ సాధిస్తుందని కోయంబత్తూర్ చెందిన యువకుడు ముత్తు సెల్వన్ పేర్కొన్నాడు. ర్యాలీ ఫర్ ఆక్సిజన్ పేరుతో ప్రపంచ పర్యటన చేస్తున్న సెల్వన్ శుక్రవారం టంగుటూరు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రపంచ యాత్రికుడు ముత్తు సెల్వన్ మాట్లాడుతూ వైద్యశాలలో బయోమెడికల్ ఇంజినీరింగ్‌గా పని చేస్తున్నానని చెప్పాడు. కరోనాలో అనేకమంది ఆక్సిజన్ అందక మరణించారని, అందులో తన ఇద్దరు స్నేహితులు కూడా మరణించారని తెలిపాడు. కేవలం ఆక్సిజన్ అందకపోవడంతో అనేకమంది మరణించడం నన్ను ఎంతో కలచి వేసిందని తెలిపాడు. ప్రపంచ వ్యాప్తంగా ఆక్సిజన్ అందకుండా ఎవరు చనిపోకూడదనే ఉద్దేశంతో ఉద్యోగానికి రాజీనామా చేశాని, చెట్లను నాటాలని ఉద్దేశంతో సైకిల్‌పై ర్యాలీ చేస్తూ చెట్లను నాటుతున్నానని తెలిపాడు. నెలకి దాదాపు రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందని అన్నాడు. స్థానిక పోలీస్ స్టేషను సిబ్బంది సహాయం అందించారు.



టంగుటూరు పోలీసులతో ప్రపంచ యాత్రికుడు

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

కనిగిరిరూరల్: పట్టణంలో కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కమిషనర్ పీ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని టకారిపాలెం, దేవాంగనగర్, గార్లపేట రోడ్డు, ఇందిరా కాలనీ, ప్రాంతాల్లో కుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు వీధి కుక్కలు బెడద ఎక్కువ ఉందని ఫిర్యాదు చేయడంలో పట్టణంలోని విపరీత స్వభావం ఉన్న కుక్కలు 600 వరకు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రత్యేక బృందం ద్వార వాటిని పట్టించి కర్నూలు, అడవిలో వదిలి వేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని కుక్కల వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఆయా సచివాలయ పరిధిలోని శానటరి సెక్రటరీలకు తెలపాలన్నారు. అనంతరం కార్యాలయంలో సచివాలయం హెల్త్ సెక్రటరీలకు, మున్సిపల్ అధికారులకు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు గురి కాకుండా వర్షకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానటరీ ఇన్స్‌పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్, హెల్త్ అసిస్టెంట్ చెన్నకేశవ, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులపై గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ సూచించారు. శుక్రవారం పీహెచ్ సెంటర్లో వైద్య సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సబ్ సెంటర్ల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు సోకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిందాచాలని.. ఆరోగ్య సబ్ సెంటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కేవి చెన్నయ్య, సూపర్‌వైజర్లు బాలు, పద్మాతి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎంపీపీ, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రాజుపాలెం వద్ద గ్రామదేవతలు పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారిచేత అర్చకులు పూజలు నిర్వహింపజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీయూటీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేకల బాలుయాదవ్, బొట్లా చిరంజీవి, పందిళ్ల ఎల్లయ్య, అటేలయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.